గ్రామీణుల జీవన విధానంపై అవగాహన అవసరం



గ్రామీణ ప్రాంతాల ప్రజల జీవనాన్ని విద్యార్థులకు చూపిస్తున్న దృశ్యం

హస్తినాపురం: నేటితరం విద్యార్థులకు గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల జీవన విధానం, వారి నేపథ్యం గురించి అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందని అక్షర స్కూల్ చైర్మన్ అర్శనపల్లి జగన్‌మోహన్ రావు అన్నారు. శనివారం గ్రామీణ ప్రాంతాల ప్రజల జీవన విధానం, వారి నేపథ్యాన్ని నేటి తరానికి అర్థమయ్యేలా చెప్పడం కోసం అక్షర ఇంటర్నేషనల్ స్కూల్ ఎల్‌బీనగర్ బ్రాంచ్ శనివారం అక్షర గ్రామోత్సవ్ పేరుతో ఒక కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా జగన్‌మోహన్‌రావు మాట్లాడుతూ, తమ పాఠశాలలో అంతర్జాతీయ పద్ధతిలో బోధన చేస్తూనే నేటి గ్రామీణ చరిత్రను ప్రజల ఇతివృత్తాన్ని విద్యార్థులకు బోధిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రమణి వారణాసి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు పటిష్ట చర్యలు



స్థానిక పోలీసులు, కేంద్ర బలగాలతో బందోబస్తు

- 24 గంటలూ తనిఖీలు
- రౌడీషీటర్ల బైండోవర్
- 'సాక్షి' ఇంటర్వ్యూలో ఎల్‌బీనగర్ డీసీపీ సాయిశ్రీ

ఇంటర్వ్యూ



నాగోలు: ఎలాంటి అక్రమాలకు, అవాంఛనీయ ఘటనలకు తావివ్వకుండా ఈనెల 30 అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని ఎల్‌బీనగర్ డీసీపీ సాయిశ్రీ తెలిపారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చినప్పటి నుంచి ఉన్నతాధికారుల ఆదేశాలు, ఇతర శాఖల సిబ్బంది సహకారంతో అక్రమంగా మద్యం, నగదు తరలించకుండా తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకుండా పటిష్ట బందోబస్తు, ఇతర జాగ్రత్తలు తీసుకుంటున్నామని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో డీసీపీ సాయిశ్రీ శనివారం 'సాక్షి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.

సాక్షి: ఎన్నికలు సజావుగా జరిగేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

డీసీపీ: ఎన్నికలు ప్రశాంతగా జరిగేందుకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే రౌడీషీటర్లను బైండోవర్ చేశాం. ఎన్నికలకు ఇబ్బందులు కలిగించేందుకు అవకాశం ఉన్న వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. ఎల్‌బీనగర్ జోన్ పరిధిలో లైసెన్స్‌డ్ గన్స్ ఉన్న వారి వద్ద నుంచి వాటిని స్వాధీనం చేసుకున్నాం. జోన్ పరిధిలోని నాలుగు సరిహద్దుల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేశాం. 24 గంటలూ తనిఖీలు చేస్తున్నాం. ఎన్నికల నిబంధనల మేరకు ఏ వ్యక్తి అయినా సరే తన వెంట రూ.50 వేలు మాత్రమే తీసుకెళ్లవచ్చు. అంతకంటే ఎక్కువ నగదు తరలిస్తున్నట్టు తేలితే వెంటనే సీజ్ చేస్తున్నాం. ఆ డబ్బుకు సరైన ఆధారాలు చూపిస్తే తిరిగి తీసుకెళ్లవచ్చు.

సాక్షి: ఎలక్షన్ నోటిఫికేషన్ వచ్చినప్పటి నుంచి ఎంత నగదు, మద్యం స్వాధీనం చేసుకున్నారు?

డీసీపీ: ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు ఎల్‌బీనగర్ జోన్ పరిధిలో రూ. 11.49 కోట్ల నగదు, రూ.9 లక్షల విలువైన మద్యం, రూ. 1.37 లక్షల గంజాయి, రూ. 4.65 లక్షల బంగారం, వెండి ఆభరణాలు, రూ. 62 లక్షల విలువైన బహుమతులు సీజ్ చేశాం.

సాక్షి: ఎన్నికల్లో ఎంత మంది పోలీసు సిబ్బంది పాల్గొంటున్నారు?

డీసీపీ: ఇప్పటికే ఎల్‌బీనగర్ జోన్‌లో రెండు కేంద్ర సాయుధ బలగాలు, స్థానిక పోలీసులు అందుబాటులో ఉన్నారు. మరో రెండు రోజుల్లో 5 కేంద్ర సాయిధ బాలగాలు అందుబాటులోకి వస్తాయి. ఆర్మీ, ఫ్లయింగ్ స్క్వాడ్, ఎస్ఎస్‌టీ, స్ట్రైకింగ్ స్పెషల్ టీంలు తిరుగుతున్నాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకొనేలా చూసేందుకు పోలీసులు సిద్ధంగా ఉన్నారు.

సాక్షి: ఎన్నికల నిబంధనలు పాటించని వారిపై ఏం చర్యలు తీసుకుంటారు?

డీసీపీ: ఎన్నికల నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. అన్ని ప్రాంతాలలో పోలీస్ సిబ్బంది నిఘా ఉంది. ఎవరైనా ఎన్నికల నిబంధనలు పాటించకుండా రాత్రి సమయంలో ప్రచారం చేసినా, నగదు, బహుమతులు అందజేసి ఓటర్లను ప్రలోభాలకు గురి చేసినా..వారిపై కేసులు నమోదు చేస్తాం.

సాక్షి: ఓటర్లకు మీరు ఇచ్చే సందేశం ఏమిటి?

డీసీపీ: ఓటు ఉన్న ప్రతి పౌరుడు ధైర్యంగా ఓటు హక్కును వినియోగించుకోవాలి. ఎవరికీ భయపడాల్సిన అవసరంలేదు. నిత్యం మీకోసం, శాంతి భద్రతల పరిరక్షణ కోసం రాచకొండ పోలీసులు పనిచేస్తున్నారు. ఎన్నికల నేపథ్యంలో రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేశారు. ఎక్కడైనా ఇబ్బందులు ఏర్పడితే డయల్ 100, 8712662100 లో ఫిర్యాదు చేయవచ్చు.

జంగ్ తెలంగాణ 2023

మలక్‌పేటలో బీజేపీ గెలుపు ఖాయం

అభ్యర్థి సంరెడ్డి సురేందర్‌రెడ్డి



ఓటు అభ్యర్థిస్తున్న సంరెడ్డి సురేందర్‌రెడ్డి

సైదాబాద్: మలక్‌పేట నియోజకవర్గంలో బీజేపీ గెలుపు ఖాయమని పార్టీ అభ్యర్థి సంరెడ్డి సురేందర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శనివారం ఆయన అజంపురా డివిజన్ పరిధిలోని డీసీపటేల్ కాలనీ, రాజనరసింహ నగర్, ఫర్హత్ నగర్‌లో పాదయాత్ర ద్వారా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మలక్‌పేటలో మూడు పర్యాయాలుగా గెలుస్తున్న ఎంఐఎం అభ్యర్థి ఇక్కడ అభివృద్ధిని విస్మరించారన్నారు. నియోజకవర్గంలో తనకు అవకాశం కల్పిస్తే నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

మీ కుటుంబ సభ్యుడిగా సేవ చేస్తా..

మలక్‌పేట మజ్లిస్ అభ్యర్థి అహ్మద్ బలాల

మలక్‌పేట: మీ కుటుంబ సభ్యుడిగా ఉండి సేవలందిస్తానని మజ్లిస్ పార్టీ అభ్యర్థి అహ్మద్ బలాల అన్నారు. ఎన్నిలక ప్రచారంలో భాగంగా శనివారం మూసారంబాగ్ రజక దోభీ సంస్థ, వీరభద్రీయ సంఘం ఆధ్వర్యంలో వేర్వేరుగా ఏర్పాటు చేసిన సమావేశాలకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 15 ఏళ్లలో చేసిన అభివృద్ధిని చూసి గాలిపటం గుర్తుకు ఓటేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మహ్మద్ అస్లాం, కనుకల రవీందర్‌రెడ్డి, రజక సంఘం గ్రేటర్ అధ్యక్షుడు నర్సింహ, మూసారంబాగ్ అధ్యక్షుడు సత్తయ్య పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి

యాకుత్‌పురా బీఆర్ఎస్ అభ్యర్థి సామ సుందర్‌రెడ్డి

చంచల్‌గూడ: సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధే తనను గెలిపిస్తాయని యాకుత్‌పురా నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి సామసుందర్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన కుర్మగూడ డివిజన్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కారు గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.ఇతర పార్టీలకు ఓటు వేస్తే ప్రయోజనం ఉండదని, తనను గెలిపిస్తే ఎన్నడూ లేని అభివృద్ధి చేసి యాకుత్‌పురా రూపురేఖలు మార్చేస్తానని హామీ ఇచ్చారు. స్థానిక నాయకులు మహేందర్‌యాదవ్, నర్సింగ్‌రావు, నవిత, అనిత, రవీందర్, రాజేందర్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

అవకాశమిస్తే అభివృద్ధి చేసి చూపిస్తాం

బీజేపీ యాకుత్‌పురా అభ్యర్థి వీరేంద్రబాబు యాదవ్

సైదాబాద్: మార్పు కోరుకుంటున్న పాతబస్తీ వాసులు బీజేపీకి ఒక్కసారి అవకాశమిస్తే అభివృద్ధిని చేసి చూపిస్తామని యాకత్‌పురా బీజేపీ అభ్యర్థి వీరేంద్రబాబు యాదవ్ అన్నారు. శనివారం ఆయన ఐఎస్‌సదన్ డివిజన్‌లోని లక్ష్మీనగర్ కాలనీ, వినయ్‌నగర్ కాలనీల్లో పాదయాత్ర చేస్తూ ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ కరపత్రాలు పంచుతూ బీజేపీకి ఓటు వేయాలని కాలనీవాసులను అభ్యర్థించారు. అవినీతి అక్రమాలకు మారు పేరుగా మారిన ఎంఐఎం నాయకులను పాతబస్తీవాసులు నమ్మటం లేదని, ఈసారి పాతబస్తీలో బీజేపీ జెండా ఎగురవేయడం ఖాయమని ఆయన అన్నారు. బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు మధుకర్‌రెడ్డి, బిక్షపతి యాదవ్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ విజయం ఖాయం

- మలక్‌పేట అభ్యర్థి తీగల అజిత్‌రెడ్డి

చాదర్‌ఘాట్: తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపిస్తాయని మలక్‌పేట నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి తీగల అజిత్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన ఓల్డ్‌మలక్‌పేట డివిజన్ పరిధిలోని పద్మానగర్, శంకర్‌నగర్‌లో పాదయాత్ర చేస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బస్తీవాసులకు పార్టీ కరపత్రాలను పంచుతూ కారు గుర్తుపై ఓటు వేసిన తనను గెలిపించాలని కోరారు. ఆయన మాట్లాడుతూ, ఈసారి మలక్‌పేట నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి: కలెక్టర్


మలక్‌పేట: మూసారంబాగ్ ఆరోరా కాలేజీలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ ఆఫీసర్ల శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి హాజరైన హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ, ఎన్నికల నియమావళిని కచ్చితంగా పాటించాలన్నారు. ఈవీఎంల ఆపరేటింగ్, వాటిని భద్రపరిచే విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఎలాంటి అవకతవకలకు తావులేకుండా ఎన్నికలు సజావుగా నిర్వహించాలన్నారు. పోలింగ్ కేంద్రాలలో అన్ని రకాల సౌకర్యాలు అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో మలక్‌పేట నియోజకవర్గ ఆర్ఓ ఉపేందర్‌రెడ్డి, ప్రాజెక్టు ఆఫీసర్ యుగేందర్‌రెడ్డి, ఏఆర్ఓ హర్షద్, మాస్టర్ ట్రైనర్స్ శ్రీనివాస్‌రెడ్డి, ధనుంజయ్య, మనోహర్, షబ్బీర్ అహ్మద్, విజయ, శ్యామల, పాల్గొన్నారు.

నేడు బీసీ కులాల సమన్వయ వేదిక సభ

మన్సూరాబాద్: తెలంగాణ బీసీ కులాల సమన్వయ వేదిక ఆధ్వర్యంలో ఎల్‌బీనగర్ రింగ్‌రోడ్డులో ఆదివారం ఉదయం 10 గంటలకు బహిరంగ సభ నిర్వహిస్తామని సమన్వయ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మ రఘురామ్‌నేత తెలిపారు. శనివారం ఆయన ఎల్బీనగర్‌లో విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రానికి బీసీని ముఖ్యమంత్రి చేస్తామని ప్రధాని మోదీ ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేస్తూ బీజేపీకి మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు.

అధికారంలోకి రాగానే పన్నులు తగ్గిస్తాం

బీజేపీ మహేశ్వరం అభ్యర్థి అందెల శ్రీరాములు



మీర్‌పేటలో శ్రీరాములుకు మంగళ హారతి పడుతున్న మహిళలు

మీర్‌పేట: బీజేపీ అధికారంలో రాగానే మీర్‌పేటలో ఇంటి పన్నులు తగ్గిస్తామని మహేశ్వరం బీజేపీ అభ్యర్థి అందెల శ్రీరాములు యాదవ్ ప్రకటించారు. శనివారం గాయత్రినగర్, బృందావన్‌కాలనీ, చింతలకుంట, లెనిన్‌నగర్, త్రివేణినగర్, ఎస్ఎల్ఎస్ఎస్ కాలనీ, జనప్రియా మహానగర్, శివాజీనగర్, చంద్రానగర్, బాలాపూర్ చౌరస్తాలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ.. స్థానికంగా ఉన్న పేదలకే డబుల్ ఇళ్లు కేటాయించాలని ఎన్నో సార్లు ప్రభుత్వానికి, స్థానిక ఎమ్మెల్యేకు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదన్నారు. డబుల్ ఇళ్ల పథకంలో బీఆర్ఎస్ ప్రభుత్వం స్థానికులను మోసం చేసిందన్నారు. మీర్‌పేట ప్రాంతంలో అధిక ఇంటి పన్నులు, నల్లా బిల్లులతో ప్రజలపై భారం పడుతోందన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే పన్నులను తగ్గిస్తామని హామీ ఇచ్చారు. ప్రచారంలో పార్టీ మీర్‌పేట అధ్యక్షుడు పెండ్యాల నర్సింహ, నాయకులు గోవర్ధన్‌రెడ్డి, మధు, సోమేశ్వర్, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

మరోమారు అవకాశం ఇవ్వండి



మాదిగల ఆత్మీయ సమ్మేళనంలో అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఎంఆర్‌పీఎస్-టీఎస్ నేతలు

- ఎల్బీనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



కొత్తపేటలోఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న కాలనీవాసులు

చంపాపేట: మరోసారి ఆశీర్వదించి తనను భారీ మెజారిటీతో గెలిపిస్తే ఎల్‌బీనగర్‌ను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి రాష్ట్రంలోని ఇతర నియోజకవర్గాలకు ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ఎల్‌బీనగర్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి, ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన కొత్తపేట డివిజన్‌లోని రాజీవ్‌గాంధీనగర్ నుంచి ఎస్‌బీహెచ్ కాలనీ వరకు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి పేరు పేరునా పలకరిస్తూ స్థానిక సమస్యలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిన తీరును తెలుసుకుంటూ కారు గుర్తుపై ఓటు వేసి తనను మరోమారు గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా పలు కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు, మహిళలు సుధీర్‌రెడ్డిని గజమాలలు, మంగళహారతులు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కొత్తపేటలో సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ...గడచిన ఐదేళ్లుగా మీలో ఒకడిగా ఉంటూ కాలనీ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం కృషి చేసిన తనను మరోమారు గెలిపించి సేవ చేసే అవకాశం కల్పించాలని కోరారు. స్థానిక సమస్యలపై అవగాహన, నియోజకవర్గ సరిహద్దులు కూడా తెలియని ఇతర పార్టీల అభ్యర్థులు మీ ముందుకు వస్తున్నారని, వారికి ఆదమరచి ఓటు వేస్తే ఐదేళ్ల పాటు అరిగోస తప్పదన్నారు. మాజీ కార్పొరేటర్ సాగర్‌రెడ్డి, డివిజన్ పార్టీ అధ్యక్షుడు లింగాల రాహుల్‌గౌడ్, నాయకులు విశ్వేశరరావు,శ్వేతారెడ్డి, అంజయ్య పాల్గొన్నారు.

హస్తినాపురంలో: హస్తినాపురం డివిజన్‌లోని నందనవనం, సెంట్రల్ కాలనీలలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఓరుగంటి వెంకటేష్‌గౌడ్ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి కారుగుర్తుకే ఓటు వేయాలని అభ్యర్థించారు.

బీఎన్‌రెడ్డిలో: వైదేహీనగర్ కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధుల ఆధ్వర్యంలో పరిసర కాలనీవాసులతో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి హాజరయ్యారు. తామంతా కారు గుర్తుపై ఓటువేసి సుధీర్‌రెడ్డిని గెలిపిస్తామని కాలనీల వాసులు ఏకగ్రీవ తీర్మానం చేశారు.

మాదిగల ఆత్మగౌరవ భవన నిర్మాణానికి కృషి..

మన్సూరాబాద్: నియోజకవర్గంలో మాదిగల ఆత్మగౌరవ భవన నిర్మాణానికి కృషి చేస్తానని బీఆర్ఎస్ ఎల్‌బీనగర్ అభ్యర్థి, ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి స్పష్టం చేశారు. ఎంఆర్‌పీఎస్-టీఎస్ జాతీయ అధ్యక్షుడు మేడి పాపయ్య మాదిగ ఆధ్వర్యంలో మాదిగల ఆత్మీయ సమ్మేళన సభ ఎల్‌బీనగర్‌లో మినీ ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో శనివారం రాత్రి నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఎంఆర్‌పీఎస్- టీఎస్ నేతలు జీడీ నర్సింహ, ఆకారపు రుక్కమ్మ, మామిడి రాంచందర్, మల్లేపాక యాదగిరి, సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళ మృతి

నాగోలు: ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళ మృతి చెందిన ఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం .. నాగోలు బండ్లగూడలోని మల్లికార్జుననగర్ ఫేజ్-2లో నివాసం ఉండే వడ్డేపల్లి హేమలత(48) శనివారం మధ్యాహ్నం ద్విచక్ర వాహనంపై ఎల్‌బీనగర్ నుంచి మన్సూరాబాద్‌కు వెళ్తోంది. కామినేని ఫ్లైఓవర్ దగ్గర ఉన్న హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వద్దకు రాగానే ఆర్టీసీ బస్సు వేగంగా వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో కుడివైపు పడిపోయిన హేమలత నడుము పైనుంచి బస్సు చక్రాలు వెళ్లాయి. తీవ్రంగా గాయపడిన ఆమెను స్థానికులు 108లో ఎల్‌బీనగర్‌లోని కామినేని ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ హేమలత మృతి చెందిందని వైద్యులు తెలిపారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. బస్సు డ్రైవర్ ప్రకాష్‌బాబును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

అగ్ని ప్రమాద ఘటనలో అపార్ట్‌మెంట్ యజమాని అరెస్ట్

నాంపల్లి: ఇటీవల బజార్‌ఘాట్‌లో జరిగిన అగ్ని ప్రమాదం సంఘటనలో పది మంది మృతి చెందిన సంగతితెలిసిందే. ఈ ఘటనలో బాలాజీ అపార్ట్‌మెంట్ యజమాని రమేష్‌కుమార్ జైస్వాల్‌ను నాంపల్లి పోలీసులు అరెస్టు చేశారు. ఇన్‌స్పెక్టర్ అభిలాష్ తెలిపిన మేరకు.. బజార్‌ఘాట్‌లోని బాలాజీ అపార్ట్‌మెంట్‌లో ఈ నెల 13న ఉదయం 9 గంటలకు అగ్ని ప్రమాదం సంభవించింది. అపార్ట్‌మెంట్ సెల్లార్‌లో అక్రమంగా ప్రమాదకరమైన కెమికల్స్‌ను నిల్వఉంచారు. భారీగా నిల్వ చేసిన కెమికల్ డ్రమ్ములకు మంటలు అంటుకుని 9 మంది సజీవ దహనమయ్యారు. అలాగే ఒకరు తీవ్ర గాయాలతో ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ప్రమాదం సంభవించిన సమయంలో భవన యజమాని రమేష్‌కుమార్ జైస్వాల్ అక్కడే ఉన్నారు. మంటలను ఆర్పే ప్రయత్నంలో కెమికల్ నుంచి వచ్చిన విషపూరితమైన వాయువులను పీల్చుకుని అస్వస్థతకు గురయ్యారు. అస్వస్థతకు గురైన అతడిని అంబులెన్స్‌లో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్చారు. అస్వస్థత నుండి కోలుకున్న రమేష్‌కుమార్ జైస్వాల్‌ను శనివారం లక్డీకాపూల్‌లోని ఆసుపత్రికి వెళ్లి అతడిని అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు.

అనాథ విద్యార్థుల రేషన్‌కు రూ. 25 వేల విరాళం



దిల్‌సుఖ్‌నగర్: నగరంలోని డీడీ కాలనీకి చెందిన సత్యనారాయణ శనివారం ఆర్‌కేపురం డివిజన్‌లోని అనాథ విద్యార్థి గృహానికి డిసెంబర్ నెల రేషన్ కోసం రూ.25 వేలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ... గృహ విద్యార్థుల బియ్యం, పప్పులు, నూనె కొనుగోలు కోసమని ఈ మొత్తాన్ని ఇచ్చామన్నారు. ఆయనకు గృహ అధ్యక్షుడు మార్గం రాజేష్ కృతజ్ఞతలు తెలిపాడు.

ఎమ్మెల్యే చేసిన మోసం ప్రజల మదిలో ఉంది



సాహెబ్‌నగర్‌లో కార్నర్ మీటింగ్‌లో ప్రసంగిస్తున్న ఈటల రాజేందర్

- బీజేపీ ఎల్‌బీనగర్ అభ్యర్థి సామ రంగారెడ్డి

మన్సూరాబాద్: ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి చేసిన మోసం ఎల్‌బీనగర్ ప్రజల మదిలో ఉందని, ఈ ఎన్నికల్లో సరైన గుణపాఠం చెప్పేందుకు ఎల్‌బీనగర్ ప్రజలు సిద్ధంగా ఉన్నారని బీజేపీ ఎల్‌బీనగర్ అభ్యర్థి సామ రంగారెడ్డి అన్నారు. మన్సూరాబాద్ డివిజన్ హయత్‌నగర్ పరిధి లెక్చరర్స్ కాలనీ, వినాయక్‌నగర్, రాజరాజేశ్వరికాలనీ, టీనగర్, పవనగిరి కాలనీ, వెంకటేశ్వరకాలనీ, ఎల్లారెడ్డికాలనీ తదితర కాలనీలలో కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డితో కలిసి శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సామ రంగారెడ్డి మాట్లాడుతూ, జీహెచ్ఎంసీ ఎన్నికల ఫలితాలే ఎల్‌బీనగర్‌లో పునరావృతం అవుతాయని, భయం గుప్పిట్లో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఉన్నారన్నారు. బీజేపీ కార్పొరేటర్లు జీహెచ్ఎంసీ నుంచి నిధులు మంజూరు చేయించి అభివృద్ధి పనులు చేపడుతుంటే అధికార బలంతో అధికారులపై ఒత్తిడి తెచ్చి అభివృద్ధిని ఎమ్మెల్యే అడ్డుకుంటున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు.

- సామ రంగారెడ్డికి మద్దతుగా బీజేపీ నేత, ఎమ్మెల్యే ఈటల రాజేందర్ శుక్రవారం రాత్రి పనామా చౌరస్తా, రెడ్‌ట్యాంక్, ఎన్జీవోస్‌కాలనీ, వైదేహినగర్, హనుమాన్ టెంపుల్, సాహెబ్‌నగర్ వరకు రోడ్ షో నిర్వహించారు. కార్పొరేటర్లు రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి, మొద్దు లచ్చిరెడ్డి పాల్గొన్నారు.
- చంపాపేట కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో చంపాపేట ఓల్డ్ విలేజ్, కుమ్మరి బస్తీ, మాంకలమ్మతోట, రెడ్డి బస్తీ, అర్జున బస్తీ, కటిక బస్తీ, ఏడబస్తీ తదితర బస్తీలలో సామ రంగారెడ్డికి గెలిపించాలని కోరుతూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

తెలంగాణలో 75 పైగా స్థానాలను కాంగ్రెస్ గెలుస్తుంది



కొత్తపేట ఆర్టీసీ కాలనీలో సమ్మేళనంలో పాల్గొన్న కర్ణాటక మంత్రి మధు బంగారప్ప, కాంగ్రెస్ అభ్యర్థి మధుయాష్కీగౌడ్

కర్ణాటక మంత్రి మధు బంగారప్ప

వనస్థలిపురం: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ 75 పైగా స్థానాలలో గెలుస్తుందని కర్ణాటక మంత్రి మధు బంగారప్ప అన్నారు. శనివారం ఎల్‌బీనగర్ నియోజక వర్గం కొత్తపేట డివిజన్ ఆర్టీసీ కాలనీ, శివగంగా కాలనీ, శ్రీనివాస కాలనీలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మధుయాష్కీ గౌడ్‌కు మద్దతుగా లింగాల కిషోర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనాలలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కర్ణాటకలో ఎన్నికల సమయంలో తాము ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామన్నారు. తెలంగాణలోని బీఆర్ఎస్ ప్రభుత్వం ఓటమి భయంతో తమపై దుష్ప్రచారం చేస్తోందని అన్నారు. ఇక్కడ కూడా సోనియమ్మ ఇచ్చిన ఆరు గ్యారంటీలను వంద రోజుల్లో అమలు చేస్తామన్నారు. అభ్యర్థి మధుయాష్కీ గౌడ్ మాట్లాడుతూ, ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో అనేక సమస్యలు ఉన్నాయని, తాము అధికారంలోకి వస్తే త్వరితగతిన వాటిని పరిష్కరిస్తామన్నారు. నాయకులు కత్తి వెంకటస్వామి, వజీర్ ప్రకాష్‌గౌడ్, పుష్పలత, చిన్నగౌడ్, కాలనీల అసోసియేషన్ ప్రతినిధులు హాజరయ్యారు.

ఇది జనానికి– ధనానికి మధ్య పోరు: మధుయాష్కీ

ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికలు జనానికి–ధనానికి మధ్య జరిగే పోరని, ప్రజలు ఏ గట్టునుంటారో తేల్చుకోవాలని మధుయాష్కీ గౌడ్ అన్నారు. వనస్థలిపురం డివిజన్‌లో కుట్ల నరసింహయాదవ్ ఆధ్వర్యంలో వివిధ కాలనీలలో జరిగిన సమావేశాలలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ప్రాంత ఎమ్మెల్యే విచ్చలవిడిగా ధనాన్ని ఖర్చుచేసి గెలుద్దామని చూస్తున్నారని, ప్రజలు మాత్రం కాంగ్రెస్ వైపే చూస్తున్నారని అన్నారు. రాంరెడ్డినగర్, క్రిస్టియన్ కాలనీ, నాగార్జున కాలనీ, హస్తినాపురం ఈస్ట్ ఫేజ్-1, 2, 3, అభ్యుదయనగర్, జనప్రియ హోమ్స్ కాలనీలలో మధుయాష్కీ గౌడ్ ప్రచారం నిర్వహించారు.

అన్ని ప్రాంతాల వారు సంతోషంగా ఉన్నారు

- బీఆర్ఎస్ మహేశ్వరం అభ్యర్థి, మంత్రి సబితారెడ్డి



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి సబితారెడ్డి

హుడాకాంప్లెక్స్: దేశంలోని అన్ని ప్రాంతాల ప్రజలు హైదరాబాద్‌లో సంతోషంగా ఉన్నారని బీఆర్ఎస్ పార్టీ మహేశ్వరం అభ్యర్థి సబితారెడ్డి అన్నారు. శనివారం సరూర్‌నగర్ డివిజన్‌లోని డాక్టర్స్‌కాలనీలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో ఆమె పాల్గొని మాట్లాడారు. శాంతిభద్రతలతో పాటు అన్ని రంగాల్లో హైదరాబాద్‌ను విశ్వనగరంగా మార్చటానికి ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి చేస్తున్నారన్నారు. నేడు జాతీయ, అంతర్జాతీయ సంస్థలు నగరానికి వస్తున్నాయన్నారు. గతంలో ఎల్‌బీనగర్‌లో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉండేదని, నేడు ఫ్లైఓవర్‌లు, అండర్‌పాస్‌ల ఏర్పాటుతో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం లభించిందన్నారు. ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మహేందర్‌యాదవ్, అంకిరెడ్డి, బాలకిషన్, కొండల్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో కేసీఆర్ ప్రభుత్వం విఫలం

- మహేశ్వరం కాంగ్రెస్ అభ్యర్థి కేఎల్లార్



ప్రచారంలో మాట్లాడుతున్న కేఎల్లార్

మీర్‌పేట: ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంతో బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, కేసీఆర్ పెద్ద మోసకారి అని మహేశ్వరం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి ఆరోపించారు. ఆయన శనివారం డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డితో కలిసి మీర్‌పేట, జిల్లెలగూడ పరిధిలోని కాలనీలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని వర్గాల సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యమని, అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీలు అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో బడంగ్‌పేట మేయర్ పారిజాతరెడ్డి, నాయకులు శ్రీశైలం, భాస్కర్‌రెడ్డి, కార్పొరేటర్ రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

భారీ మెజారిటీతో గెలిపించాలి...

దిల్‌సుఖ్‌నగర్: ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ అభ్యర్థి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని పార్టీ సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మహేశ్వరం నియోజకవర్గం ఆర్‌కే పురం డివిజన్ వాసవి కాలనీలోని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కార్యాలయంలో శనివారం నిర్వహించిన బూత్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు.

గంజాయి చాక్లెట్లు విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

నాగోలు: గంజాయి చాక్లెట్ విక్రయిస్తున్న వ్యక్తిని ఎల్‌బీనగర్ ఎస్ఓటీ పోలీసులు, ఎల్‌బీనగర్ పోలీసులు అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 200 చాక్లెట్ల (మొత్తం కేజీ)ను, ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఉత్తరప్రదేశ్ రాష్ట్ర, మీర్జాపూర్‌కు చెందిన రంజన్‌కుమార్ కొంత కాలంగా ఎల్‌బీనగర్ బైరామల్‌గూడలో ఉంటూ స్థానిక జెట్ కింగ్‌లో టైల్స్ వర్కర్‌గా పని చేస్తున్నాడు. తక్కువ సమయంలో సులువుగా డబ్బులు సంపాదించాలని యూపీ నుంచి నిషిద్ధ గంజాయిని చాక్లెట్‌ను తెచ్చి ఎల్‌బీనగర్ ప్రాంతంలో పేదలకు విక్రయిస్తున్నాడు. సమాచారం అందుకున్న ఎల్‌బీనగర్ ఎస్ఓటీ పోలీసులు అతడిపై నిఘా పెట్టారు. శుక్రవారం రాత్రి బైరామల్‌గూడలో రంజన్‌కుమార్ గంజాయి చాక్లెట్లు విక్రయిస్తుండగా పట్టుకున్నారు.